ప్రజాశక్తి
గురువారం 5 డిసెంబర్ 2024
5
శ్రీ సత్యసాయి





అసంపూర్తిగా ఉన్న ఎన్‌హెచ్‌-67 రోడ్డు పనులు

'ఆఖరి నిద్ర'

వ్యవసాయ కూలి పనులు చేసుకుని జీవనం సాగించే కుటుంబ వారిది. ఉదయం భార్యాభర్తలిద్దరూ పనులకు వెళ్లి రాత్రి ఇంటికి వచ్చేవారు. రోజంతా కష్టపడి సాయంత్రం ఇంట్లో సేదదీరేవారు. రోజూమాదిరే మంగళవారం రాత్రి కూతురితో కలిసి వారి ఇంట్లో నిద్రించారు. కుమార్తెతో సంతోషంగా కబుర్లు చెప్పకుంటూ కునుకులోకి జారుకున్న వారికి అదే ఆఖరి నిద్ర అయ్యింది. అనుకోని ఘటనతో కూతురితో సహా భార్యాభర్తలిద్దరూ శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ఇంటిపైకప్పు కుప్పకూలి మీదపడడంతో ముగ్గురూ మృత్యుఒడిలోకి చేరారు. అనంతపురం జిల్లా కుందుర్పి మండలం రుద్రంపల్లిలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన బాధిత కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.



గంగన్న



సంధ్య



శ్రీదేవి

- కుటుంబాన్ని కబళించిన మృత్యువు
- మిద్దె పైకప్పు కూలి భార్యాభర్త, కుమార్తె మృతి
- రుద్రంపల్లిలో విషాద ఘటన
- ఎమ్మెల్యే అమిలినేని దిగ్భ్రాంతి
- ఘటనపై ఆరా తీసిన నారా లోకేష్

ప్రజాశక్తి -కుందుర్పి

కుందుర్పి మండలం రుద్రంపల్లి గ్రామానికి చెందిన కురుబ గంగన్న (43), శ్రీదేవి (38) భార్యాభర్తలు. వీరికి 9వ తరగతి చదువుతున్న కూతురు సంధ్య (14), ఇంటర్ చదువుతున్న కుమారుడు ఉన్నాడు. కుమారుడు అనంతపురంలో హాస్టళ్లో ఉంటూ చదువుతుండగా కూతురు తల్లిదండ్రుల వద్దనే ఉంటూ 9వ తరగతి చదువుతోంది. భార్యాభర్తలు గంగన్న, శ్రీదేవి ఇద్దరూ వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగించేవారు. మంగళవారం రాత్రి వీరిద్దరూ కుమార్తెతో కలిసి ఇంట్లో నిద్రించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులకు ఇంటి పైకప్పు బాగా తడిసి మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఒకసారిగా కుప్పకూలి కిందపడింది. పైకప్పు మొత్తం నిద్రిస్తున్న ముగ్గురిపై పడడంతో వారంతా అందులో కూరుకుపోయారు. అర్ధరాత్రి సమయం కావడంతో ఎవరూ దీనిని గుర్తించలేదు. బుధవారం ఉదయం గంగన్న తల్లి ఇంటి వద్దకు వెళ్లి చూడగా తలుపులు మూసి ఉండడాన్ని గమనించింది. కిటికీలోనుంచి చూడగా ఇంటి పైకప్పు కూలిన విషయాన్ని గుర్తించింది. వెంటనే ఆమె చుట్టుపక్కల వారి సాయంతో లోపలికి వెళ్లి చూడగా అప్పటికే గంగన్న, శ్రీదేవి, సంధ్యలు పైకప్పు కింద కూరుకుపోయి మరణించారు. ఈ ఘటనతో వారి బంధువులు కన్నీటి పర్యవంతం అయ్యారు.

ఘటనపై ఎమ్మెల్యే అమలినేని దిగ్భ్రాంతి

రుద్రంపల్లి గ్రామంలో ఇంటిపైకప్పు కూలి ముగ్గురు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శబరిమల యాత్రలో ఉన్న ఆయన ఘటనపై గ్రామ టిడిపి నాయకులతో ఫోన్‌లో మాట్లాడారు. మృతుల కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.50వేలను అందించే ఏర్పాటు చేశారు. అధికారులను గ్రామానికి పంపి సహాయక చర్యలు చేపట్టేలా ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.



మిద్దె పైకప్పు శకలాల కింద ఉన్న మృతదేహాలు

మంత్రి నారా లోకేష్ ఆరా

మిద్దె కూలిన ఘటనపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆరా తీశారు. బుధవారం ఉదయం ఆయన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబుతో మాట్లాడారు. ఘటన వివరాలను తెలుసుకుని బాధిత కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు.

అధికారుల పరిశీలన

రుద్రంపల్లి గ్రామంలో ఆర్డీవో వసంత బాబు, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ నగేష్‌లు పరిశీలన చేశారు. ప్రమాద స్థలం వద్దకు వెళ్లి స్థానికులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాత మిద్దె కావడం, వర్షానికి తడవడం వల్లనే ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపారు. వీరి వెంట సర్పంచి మహదేవమ్మ విజయకుమార్, ఎంపిటిసి మమతా మల్లికార్జున, టిడిపి సీనియర్ నాయకులు వెంకటేష్, కురుబ రామాంజి నేయులు, గంగన్న, మాజీ జెడ్పీటీసీ మల్లికార్జున, కంబదూరు రామ్మోహన్ చౌదరి, కుందుర్పి మండల టీడీపీ అధ్యక్షులు జి.ధనుంజయ, ఎస్.మల్లాపురం నాగేంద్ర పాల్గొన్నారు.

శెట్టిపల్లిలో మరో విషాదం

కూలిన నిర్మాణంలో ఉన్న పైకప్పు - ఇద్దరు రైతులు మృతి



శివారెడ్డి,



లక్ష్మినారాయణరెడ్డి

ప్రజాశక్తి-చిలమత్తూరు

వ్యవసాయ తోట వద్ద ఉండేందుకు నిర్మాణం చేస్తున్న ఇంటి పైకప్పు ప్రమాదవశాత్తు కూలిపోవడంతో ఇద్దరు రైతులు అక్కడికక్కడే మరణించారు. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం శెట్టిపల్లి గ్రామంలో బుధవారం మధ్యాహ్నం ఈ విషాధ ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... శెట్టిపల్లి గ్రామానికి చెందిన రైతు శివారెడ్డి(50) పొగాకు పంట సాగు చేస్తున్నాడు. పంట సాగు, కాపలాకు అనుకూలంగా ఉండేందుకు పొలంలో ఓ చిన్న గది నిర్మాణాన్ని చేసుకున్నాడు. ప్రస్తుతం దాని పైభాగాన నల్లబండలు స్లాబ్ వేసుకుంటున్నాడు. నల్లబండల స్లాబ్ కింద వాడిన ఇనుప తీర్లు నాణ్యత లేకపోవడంతో అవి కిందకు కుంగాయి. దీనిని శివారెడ్డి గమనించకోలేదు. బుధవారం మధ్యాహ్నం ఇంటి పై భాగాన కూలీలు పైన కాంక్రీటు వేస్తుండగా స్లాబు కిందకు కుంగింది. కూలీలు ఈ విషయాన్ని శివారెడ్డికి చెప్పగా ఆయన తన కుమారుడు రాజశేఖర్ రెడ్డి, రైతుకూలీ ఎద్దుల లక్ష్మినారాయణ రెడ్డి(45) సహాయంతో కుంగుతున్న పైకప్పును సరిచేసేందుకు కింది భాగాన కర్రలు అమర్చేందుకు వెళ్లారు. ఇలా వీరు కర్రలు అమరస్తుండగా స్లాబ్ మొత్తం కుప్పకూలి వారిమీద పడింది. దీంతో ఎద్దుల లక్ష్మినారాయణ రెడ్డి అక్కడిక్కడే మరణించాడు. మిద్దె శకలాల కింద ఉన్న రైతు శివారెడ్డి, అతని కుమారుడు రాజశేఖర్‌రెడ్డిని చికత్స నిమిత్తం బెంగుళూరుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో శివారెడ్డి మరణించాడు. కాగా మిద్దె కూలుతున్న సమయంలో దాని పై భాగంలో ఉన్న కూలీలంతా చాకచక్యంగా పక్కనున్న పొలంలోకి దూకేయడంతో పెనుప్రమాదం తప్పింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

8 ఏళ్లుగా పనుల పెండింగ్..!

- మధ్యలోనే ఆగిన ఎన్‌హెచ్ 67
- రాప్తాడు వంతెన పరిస్థితీ అంతే
- రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎనిమిదేళ్లుగా ఆ రహదారి నిర్మాణం జరుగుతూనే ఉంది. ఎప్పటికి పూర్తవుతుందో కూడా ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. ఎన్‌హెచ్-67 అనంతపురం జిల్లాలో 57 కిలోమీటర్ల మేర ఉంది. ఈ రహదారి నిర్మాణానికి 2016 చేపట్టారు. మూడొంతులు నిర్మాణం జరిగి మధ్యలోనే ఆగింది. కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో ఎక్కడి పనులు అక్కడే అన్న విధంగా ఉన్నాయి.

కర్నాటక రాష్ట్రంలో రాంనగర్ నుంచి కృష్ణపట్నం వరకు 778 కిలోమీటర్లు మేరకు ఎన్‌హెచ్ 67 ఉంది. ఈ రహదారి కర్నాటకలోని బళ్లారి జిల్లా నుంచి అంటే గుంతకల్లు నుంచి గుత్తి మీదుగా భోగసముద్రం వరకు ఈ ఎన్‌హెచ్ 67 పోతుంది. నాలుగు వరుసల రహదారి కోసం రూ.539.99 కోట్లతో డాట్, ఎస్ఆర్‌కె జాయింట్ వెంచర్‌గా కాంట్రాక్టును దక్కించుకోవడం జరిగింది. 2016లో ఈ పనులను ఆ సంస్థకు అప్పగించారు. 2022 సంవత్సరం నాటికి ఈపనులను పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటిరకు 86 శాతం పనులను పూర్తి చేసి ఆపివేశారు. దీంతో గుంతకల్లు-గుత్తి మధ్యలో అనేక చోట్ల రహదారిలో అడ్డంకులున్నాయి. ఈ అడ్డంకుల క్రమంలో రెండేళ్ల క్రితం ఒక కారు గుంతలో పడి వ్యక్తి చనిపోయారు. ఇప్పటికీ ఈ రహదారులు పనులు మాత్రం అర్థాంతరంగానే ఆగి ఉన్నాయి. కాంట్రాక్టర్ పనులు చేయలేదని అధికారులు పాత కాంట్రాక్టును రద్దుచేశారు. మిగిలిన పనులను ఎప్పటికి చేపడతారన్నది ప్రశ్నార్థకంగానే ఉంది.

రాప్తాడు రైల్వే బ్రిడ్జిదీ అదే తీరు

జాతీయ రహదారి 42 నుంచి ఎస్‌కెయును కలిపేందుకు నిర్మించిన బైపాస్ రహదారి నిర్మాణంలో భాగంగా మధ్యలో రైల్వే గేటు ఉంది. దీని వద్ద బ్రిడ్జి నిర్మాణపు పనులు 2018 నుంచి జరుగుతూనే ఉన్నాయి. తవం కన్‌స్ట్రక్షన్స్‌కు ఈ పనుల బాధ్యతను అప్పగించారు. రూ.55.55 కోట్లతో ఈ పనులను అప్పగించారు. ఈ బ్రిడ్జి పనులను 2022 లోపు పూర్తి చేయాల్సి ఉంది. రూ.37.91 కోట్లు వ్యయం పనులను పూర్తి చేశారు. ఆ తరువాత ఈ సంస్థ పనులను ఆపేసింది. ఈ నిర్మాణం పూర్తికాకపోవడంతో అనంతపురం నగరం నుంచి రాప్తాడు వెళ్లే సమయంలో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోంది. ప్రస్తుతం ఈ పనులనూ రద్దు చేశారు. ఇవి కూడా తిరిగి టెండర్లు పిలిచి కొత్త వారికి పనులు అప్పగించాల్సిఉంది. ఈ ప్రక్రియ ఎన్నేళ్లకు పూర్తవుతుందోనని వాహదారులు వాపోతున్నారు. ఇలా కీలకమైన రెండు ప్రధాన రహదారుల పరిస్థితి ఇబ్బందులు నెలకొన్నాయి. వీటిని త్వరగా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



కార్మికశాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బీడీ కార్మికులు

బీడీ కార్మికులను ఆదుకోండి

బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ జి.ఓబులు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

చాలీచాలని ఆదాయంతో సంక్షోభంలో కూరుకుపోయిన బీడీ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకునే చర్యలు చేపట్టాలని బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ జి.ఓబులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ బీడీ అండ్ సిగార్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బీడీ కార్మికులు బుధవారం కదిరి పట్టణంలోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో పాల్గొన్న ఓబులు మాట్లాడుతూ కదిరి పట్టణంలో ఐదువేల మందికి పైగా బీడీ కార్మికులు ఉన్నారని, వీరిలో 99 శాతం పేద ముస్లిం, మైనార్టీలే ఉన్నారన్నారు. ఏళ్ల తరబడి బీడీ కార్మికులుగా వీరు పని చేస్తున్నా చాలీచాలని వేతనాలతో కుటుంబం గడవని పరిస్థితి నెలకొందన్నారు. చాలా మంది కార్మికులు శ్వాసకోస, టీబీ, అస్తమా, నడుమునొప్పి, కంటి చూపు దెబ్బ తినడం లాంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కదిరి పట్టణంలో బీడీ కార్మికులకు ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన బీడీ కార్మికులకు సంబంధించిన సంక్షేమ చట్టాలను పునరుద్ధించాలన్నారు. బీడీ నుంచి వసూలు చేసే జీఎస్టీని బీడీ కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని కోరారు. ఈ-శ్రమ్ కార్డుల్లో బీడీ తయారు రంగంలో పనిచేసే వారందరినీ బీడీ కార్మికులుగా నమోదు చేయాలన్నారు. బీడీ కార్మికుల పిల్లలకు కేంద్ర ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్ మొత్తాన్ని పెంచాలన్నారు. ఇల్లు లేని బీడీ కార్మికులకు పక్కా గృహాలు కట్టించి ఇవ్వాలని కోరారు. 60 సంవత్సరాలు దాటిన బీడీ కార్మికులకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలన్నారు. పట్టణంలో టిడ్కో ఇళ్ల కోసం డబ్బులు కట్టిన బీడీ కార్మికులకు వెంటనే గృహాలను ఇవ్వాలన్నారు. ధర్నా అనంతరం లేబర్ అధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జివిఎల్.నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్, రామ్మోహన్, ఫాజిల్, బాబ్ జాన్, బీడీ కార్మికులు మున్నీ, సుమియా, వహీదా, షబానా, రమీజా, అమ్మజన్ తదితరులు పాల్గొన్నారు. బీడీ కార్మికుల ఆందోళనకు అంగన్వాడీ యూనియన్ నాయకులు మాబున్నీసా, సుజాత, శారదా, మాధవి, పార్వతి సంఘీభావం తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

విరివిగా రుణాలు ఇవ్వండి : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని రైతులకు, చేనేత కార్మికులకు, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో త్రైమాసిక ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లక్ష్య సాధన ప్రగతిపై బ్యాంకర్లు, వివిధ ప్రభుత్వ అధికారులతో సంప్రదింపుల కమిటీ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు బ్యాంకర్లతో సమన్వయం చేసుకొని అర్హత కలిగిన వారికి రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్యాంకర్లు భాగస్వామ్యంతో జిల్లాలో స్థిరమైన వృద్ధిరేటు సాధనకు అందరూ కృషి చేద్దామన్నారు. రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను ఎలాంటి పెండింగ్లో ఉంచకుండా అర్హులైన వారికి త్వరగతిన రుణాలు మంజూరు చేయాలన్నారు. దరఖాస్తుల తిరస్కరణ లేదా ఆమోదించవలసిన వివరాలు తనకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చే బుధవారం తిరిగి సమావేశం ఉంటుందని అప్పుడు తగిన నివేదికలతో రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం రమణ కుమార్, పట్టు పరిశ్రమల శాఖ అధికారి పద్మమ్మ, వ్యవసాయ అధికారి సుబ్బారావు, డిఆర్‌డిఎ పిడి నరసయ్య, ఆర్‌బిఐ డిడిఎం అనురాధ, ఏపీజిబి ఆర్‌ఎం రమేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో ఇళ్లు కూల్చివేత

అడ్డుకున్న వైసిపి నాయకులు



ఇంటిని కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది



కూల్చివేతలపై మాట్లాడుతున్న ఆర్డీవో సువర్ణ

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువు సమీపంలోని ధర్మవరం రోడ్డు జగనన్న కాలనీ 384 సర్వే నెంబర్లో ఇళ్ల నిర్మాణాల వ్యవహారం ఉద్రిక్తతలకు దారి తీసింది. నిర్మాణం చేస్తున్న వారికి పట్టాలు ఇవ్వలేదన్న కారణంతో రెవెన్యూ అధికారులు అక్కడ నిర్మాణాలు చేస్తున్న వారికి ఇటీవల నోటీసులు జారీ చేశారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ కొత్తచెరువు తహశీల్దార్ నీలకంఠారెడ్డిలు పోలీసు బందోబస్తు నడుమ జెసిబిలతో అక్రమ ఇళ్ల కూల్చివేతకు వెళ్లారు. ఈ సమయంలో వైసిపి నాయకులు జెసిబిలకు అడ్డుగా పడుకుని నిరసన తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... గత వైసిపి ప్రభుత్వంలో వైసీపీ టౌన్ కన్వీనర్ ముద్దుల భాస్కర్ తన భార్య రమాదేవి పేరుతో పట్టా పొందారు. గతంలో వారు ఇందిరమ్మ ఇల్లు కూడా నిర్మించుకున్నారని, మరొక ఫ్లాట్ తన తల్లి పేరుతో గతంలోనే రిజిస్టర్ పత్రం పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒకే వ్యక్తి మూడు సెంట్ల స్థలంలో పంచాయతీ రెవెన్యూ అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేస్తున్నారంటూ టిడిపి నాయకులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు పట్టాలు లేనిదే ఇళ్ల నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు. అయినా ఇంటి నిర్మాణాలు జరుగుతుండడంతో ఉన్నతాధికారుల సూచన మేరకు నిర్మాణంలో ఉన్న ఇంటిని కూల్చివేయడానికి పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, తహశీల్దార్ నీలకంఠారెడ్డిలు పోలీసు బందోబస్తుతో జెసిబితో కాలనీ వద్దకు బుధవారం ఉదయం చేరుకున్నారు. ఈ సమయంలో వైస్ ఎంపీపీ సరళ, ఉప సర్పంచి యుగంధర్, మాజీ జెడ్పిటిసి మహాలక్ష్మి, మాజీ ఎంపీపీ భర్త నారాయణ, పలువురు వైసిపి నాయకులు అధికారులతో వాదించారు. భాస్కర్ తన తల్లి జెసిబిని అడ్డుకుని దాని కింద పడుకుని నిరసన తెలిపారు. ఈ సమయంలో కొద్దిసేపు అధికారులు, వైసిపి నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. తమకు ఐదురు రోజుల సమయంలో ఇవ్వాలని వైసిపి నాయకులు కోరినా అధికారులు వినలేదు. విఆర్ఎలతో వెనుకవైపు ఇంటి గోడలను పూర్తిగా కూల్చివేశారు.

పట్టాలు ఇవ్వనిదే నిర్మాణాలు చేయొద్దు : ఆర్డీవో

జగనన్న కాలనీలో 22 మంది లబ్ధిదారులకు గత ప్రభుత్వంలో రిజిస్టర్ పత్రాలు ఇచ్చారు. వారికి పట్టాలు ఇవ్వనందున ఇతరులు ఆక్రమించుకుంటారని కొందరు పునాదులు వేశారు. వీటికి పట్టాలు ఇవ్వాలని ఆర్డీవో సువర్ణను లబ్ధిదారులు బుధవారం నాడు కోరారు. రెవెన్యూ అధికారుల ద్వారా పట్టాలు ఇచ్చేంత వరకు ఎవరూ నిర్మాణాలు చేపట్టరాదని ఆర్డీవో వారికి సూచించారు. పట్టాలున్న వారు వాటిని తహశీల్దార్ కార్యాలయంలో అందజేయాలన్నారు. రిజిస్టర్ అయిన 22 మంది స్థలాలను పరిశీలించి అర్హులైన వారికి పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నీలకంఠారెడ్డి, ఎంపీడీవో నటరాజ్, సిఐ ఇందిరా, వీఆర్వో నజీర్, మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, చెన్నయ్య, కాటమయ్య, పోలీసు, రవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన 'పురం' నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం వైసిపి నేతలు బుధవారం తాడేపల్లి కేంద్ర పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. మాజీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్, నియోజకవర్గ ఇన్ ఛార్జ్ దీపికా వేణురెడ్డి వర్గీయులు వేర్వేరుగా జగన్‌ను కలిశారు. నవీన్ తో పాటు హిందూపురం మున్సిపల్ డెలిగేట్ చైర్మన్ బలరామిరెడ్డి, నాయకులు నారాయణస్వామి, శెట్టిపల్లి జగన్మోహన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు జగన్మోహన్ రెడ్డిని కలిశారు. అదే విధంగా శ్రీ సత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్చార్జ్ దీపికా వేణు రెడ్డి, నాయకులు శివ, శ్రీరామరెడ్డి, పురుషోత్తం రెడ్డి, కొటిపి శ్రీనివాస్ రెడ్డి, ప్రణయ్ రెడ్డి తదితరులు జగన్మోహన్ రెడ్డిని కలిసి బొకేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా నేతలతో అధినేత పార్టీ వివరాలను అడిగి తెలుసుకుని, అందరూ ఐక్యంగా పనిచేయాలని సూచించినట్లు నాయకులకు తెలిపారు. కాగా ఇరు వర్గాల నేతలు విడివిడిగా అధినేతను కలవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

రొద్దం :మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని ఆపార్టీకి చెందిన రొద్దం మండల నాయకులు బుధవారం కలిశారు. పార్టీ నియోజక వర్గ ఇన్‌ఛార్జిఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో మండల నాయకులు తాడేపల్లిలో జగన్‌ను కలసి పెనుకొండ నియోజక వర్గ రాజకీయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు తిమ్మయ్య, అక్కులప్ప, ఎన్ నారాయణ రెడ్డి, సి నారాయణ రెడ్డి. లక్ష్మినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

ఫెంగల్ తుఫాను వర్షాల నేపథ్యంలో పంటల విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రామగిరి మండలం వెంకటాపురం సమీపంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వ్యవసాయశాఖ అధికారులతో కలసి వరి, కంది పంటల్ని పరిశీలించారు. తుఫాను ప్రభావంతో వరి, కంది పంటలకు నష్టం వాటిల్లితున్నట్టు రైతులు వాపోయారు. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. రైతులకు తగిన సూచనలు చేయాలన్నారు. వరి పంట గింజ పట్టే దశలో ఉందని, కందిపంట పూత నుంచి కాయ వచ్చే దశలో ఉందన్నారు. ఇలాంటి సమయంలో తుఫాన్ రావడం చాలా బాధాకరమన్నారు. అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన విధంగా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రామసుబ్బయ్య, మండల వ్యవసాయ అధికారి ఉదయ్ కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

హెచ్‌ఎం సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - రొద్దం

మడకశిర మండలం ఆమిదాల గొంది ఘటనకు బాధ్యులను చేస్తూ హెచ్‌ఎంను సస్పెండ్ చేయడం తగదని వెంటనే సస్పెన్షన్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఎపిటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి హత్య ఘటనకు హెచ్‌ఎంను బాధ్యులను చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, ఆంజనేయులు, బాలచంద్రమౌళి,చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయానికి కంప్యూటర్ల వితరణ

ప్రజాశక్తి - లేపాక్షి

స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి రమామణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధినేత, సమాజ సేవకులు,లేపాక్షి ఆలయ చైర్మన్ కరణం రమానందన్ రెండు కంప్యూటర్లను బుధవారం అందజేశారు. వీటిని తహశీల్దార్ సౌజన్య లక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా రమానందన్ మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయం నుంచి ప్రజలకు అందించే సేవలు మరింత వేగవంతం కావటానికి తనవంతుగా కంప్యూటర్లు అందజేసినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో రమానందన్‌కు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

కళా ఉత్సవ్ పోటీలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి బుక్కపట్నం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహించే కళా ఉత్సవ్ పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డైట్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రామకృష్ణ కోరారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ స్కూల్స్ కాలేజీలలో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చునితెలిపారు. నృత్యం, సంగీతం, చిత్రలేఖనం తదితర ఆరు విభాగాలలో ఈనెల 9వ తేదీన బుక్కపట్నంలోని ప్రభుత్వ డైట్ కళాశాల నందు పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 7వ తేదీ లోపల తమ పేర్లను కార్యనిర్వాహకుల వద్ద నమోదు చేసుకోవాలని తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయికి పంపించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు డైట్ లెక్చరర్ లక్ష్మీనారాయణ 9440944737 నెంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపల్ తెలిపారు.

విద్యుత్ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల పరిధిలోని రాళ్ల అనంతపురం సబ్ స్టేషన్ సమీపంలో జొన్నల కొత్తపల్లి, ఉప్పలపాడు పంచాయతీలలో నెలకొన్న విద్యుత్ సమస్య పరిష్కారమైంది. లోవోల్టేసమస్య, విద్యుత్ అంతరాయం సమస్యలు తరచూ ఏర్పడుతుండడంతో రాళ్ల అనంతపురం, ఉప్పలపాడు గ్రామాలకు వేర్వేరు బ్రేకర్లను సబ్ స్టేషన్‌లో ఏర్పాటు చేశారు. దీంతో దాదాపు 15 గ్రామాలకు లో వోల్టేజ్ సమస్య,విద్యుత్ అంతరాయం సమస్య పరిష్కారమైనట్లు కదిరి ఏడీ ఉదయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్ద మద్యం దుకాణాలొద్దు



పోలీసులతో వాగ్వాదానికి దిగిన మహిళలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

బత్తలపల్లి మెయిన్ రోడ్డులో నివాసగృహాల మధ్య ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణానికి అనుమతులు ఇవ్వవద్దని బత్తలపల్లిలోని పాతూరుకు చెందిన మహిళలు బుదవారం ఆందోళనకు దిగారు. ఈసందర్బంగా వారు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. నిరసన తెలుపుతున్న మహిళలను పోలీసులు వీడియో తీస్తూ కేసులు పెడతామంటూ బెదిరించారు. బత్తలపల్లికి మూడు మద్యం దుకాణాలను ప్రభుత్వం అనుమతి ఇచ్చింది అందులో రెండు దుకాణాలు బత్తలపల్లి కూడలిలో ఏర్పాటు చేశారు. వాటి ఏర్పాటు ప్రభుత్వ నిబంధనలకు విరుద్దమంటూ ధర్మవరం రోడ్డుకు తరలించారు. మరో దుకాణాన్ని బత్తలపల్లిలోని తాడిపత్రి రోడ్డుకు గల నంది వాటర్ ప్లాంటు సమీపంలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పాతూరుకు చెందిన పలువురు మహిళలు రోడ్డుపైకి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడ శుద్ధిజలాల నీరు తీసుకువెళ్లేందుకు మహిళలు వస్తుంటారన్నారు. అంతేకాకుండా ఇక్కడికి సమీపంలో వెంకటేశ్వర దేవాలయం. శివాలయం ఉందన్నారు. ఇలాంటి చోట మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఈ ప్రాంతంలో మద్యం దుకాణానికి ప్రభుత్వం ఎలా అనుమతులు ఇస్తుందని నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంలో కొందరు కానిస్టేబుల్లు వీడియోలలో మహిళలను చిత్రీకరిస్తూ కేసులు పెడతామని, ఇలా రోడ్డు పై కూర్చొవద్దని బెదిరింపులకు దిగారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు ఇలా బెదిరింపులకు దిగడం ఏమిటని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన ఎస్ఐ సమస్యపై ఎక్సైజ్ అధికారులకు, పోలీసులకు, తహశీల్దారుకు వినతి పత్రాలు అందజేయాలని సూచించారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని సి కోడిగేపల్లి పంచాయతీకి చెందిన వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. ఆపార్టీకి చెందిన మల్లికార్జున రెడ్డి, అనిమేటర్ భాగ్యమ్మ కేతేపల్లి,వార్డ్ మెంబెర్ కె.శ్రీనివాసులు, ,హనుమంతరాయప్ప, లింగప్ప తదితరులు టిడిపిలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి పార్టీ కండూవా కపిప పార్టీలోకి ఆహ్వానించారు.

పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని భక్తరపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి జిల్లెడ గుంట శ్రీ ఆంజనేయస్వామి వార్ల బ్రహ్మ రథోత్సవానికి సంబందించిన పోస్టర్లు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి బుధవారం విడుదల చేవారు. ఈనెల 13 నుంచి 19 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ గుండుమల జయప్ప, బ్రహ్మోత్సవ కమిటీ చైర్మన్ నరసే గౌడ్ ,కార్యనిర్వహణ అధికారి నరసింహారాజు, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, , టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - మడకశిర

రొల్ల నియోజక వర్గ పరిధిలోని రొల్ల మండలకేంద్రం లక్ష్మీ ప్యాలెస్‌లో శ్రీ చక్ర హాస్పిటల్ వారిచే ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రారంభించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులు ఇక్కడ ఏర్పాటుచేసి ప్రజలకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్లు దాసి రెడ్డి, లక్ష్మీనారాయణ, గురుమూర్తి , కార్యదర్శి ఈరన్న, క్లస్టర్ ఇన్‌ఛార్జి భరత్, కృష్ణమూర్తి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

మడకశిర : మండల పరిధిలోని జమ్మానిపల్లిలో వీధి దీపాలను ఏర్పాటు చేశారు. సర్పంచి ఆధ్వర్యంలో గ్రామంలో వీధిలైట్లను ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కుమారుడు రంగనాథ్, టీడీపీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

ఓబుళదేవర చెరువు : మండల పరిధిలోని సున్నంపల్లి దాదిరెడ్డిపల్లి వణుకు వారి పల్లి తదితర గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ అధికారి వరలక్ష్మి తనిఖీ చేవారు. కేంద్రాలలో రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం పెడుతున్నారా అని గర్భిణులను, చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ విజయ కుమారి పాల్గొన్నారు.

భూకబ్జాపై చర్యలు తీసుకోవాలి

ముదిగుబ్బ : మండలంలో జరుగుతున్న భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో సిపిఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి హరీష్ బాబు, సచివాలయ సిబ్బంది, మంత్రి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన నోటీసులను డిఇఒకు అందజేస్తున్న నాయకులు

11న డిఇఒ కార్యాలయం ముందు నిరసన : యుటిఎఫ్

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11న డిఇఒ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ఎం. సుధాకర్ తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం ధర్మవరంలోని ఉప విద్యాశాఖధికారి కార్యాలయంలో జిల్లా విద్యా శాఖాధికారిని కలిసి సమస్యలను విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత ప్రభుత్వ పరిపాలనకు పెద్దగా తేడా లేదన్నారు. మడకశిర మండలం ఆమిదాలగొంది సంఘటనకు హెచ్ఎంను సస్పెండ్ చేయడం సరికాదన్నారు.ఉపాధ్యాయులకు పనిభారం అధికమైందన్నారు. అత్యవసర సందర్భాల్లో కూడా సెలవులను కూడా మంజూరు చేయడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 100 రోజుల యాక్షన్ ప్లాన్ ఉత్తర్వులు ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తున్నాయన్నారు. ఈ అసంబద్ధ నిర్ణయాలు ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయన్నారు. విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలని డిమాండ్‌తో జిల్లా శాఖ నిరసన ప్రదర్శనలు చేపట్టాలని నిర్ణయించిందని చెప్పారు. అందులో బాగంగా 11న కొత్తచెరువులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు, 16న రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శనలు చేపడతామన్నారు. నిరసన నోటీసును డిఇఒకు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేరీ వర కుమారి, లతాదేవి, రామకృష్ణ నాయక్, హరికృష్ణ, లక్ష్మయ్య, రాంప్రసాద్, రామాంజినేయులు, సాయి గణేష్, బిళ్ళే రామాంజనేయులు, హరిశంకర్ , వెంకట కిషోర్, బాల గొండ్ల ఆంజనేయులు, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్



అంకె కుమారి (ఫైల్‌ఫొటో)

తనమీద కేసు పెడతారన్న భయంతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వివరాలు... మండలంలోని దర్శనమల గ్రామానికి చెందిన మహిళ అంకె కుమారి భర్త అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతిచెందాడు. అప్పటినుండి ఆమె గ్రామంలో చిన్న దుకాణం ఏర్పాటు చేసుకుని తన ఇద్దరి పిల్లలతో జీవనం కొనసాగిస్తుంది. అయితే కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలో మద్యం బాటిళ్ళు తెచ్చుకొని అమ్ముకుని జీవనం కొనసాగిస్తుండేది. గ్రామంలో ఆమెతో పాటు మరో ముగ్గురు మద్యం విక్రయిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఇదిలా ఉండగా ఎక్సైజ్ పోలీసులు మంగళవారం గ్రామంలో దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా అంకె కుమారి ఇంటిని సోదా చేశారు. ఇంటిలో 9 మద్యం బాటిళ్లు దొరికాయి. దీంతో పోలీసులు ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఉదయం స్టేషన్‌కు రావాలని ఆదేశించి వెళ్లారు. దీన్ని అవమానంగా భావించిన అంకె కుమారి తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అంకె కుమారి ఆత్మహత్యకు పోలీసులే కారణమని ఆమె బంధువులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో మరో ముగ్గురు మద్యం విక్రయిస్తున్నా వారిని వదిలేసి మగతోడు లేక పిల్లలను పోషించుకోవటానికి మద్యం విక్రయిస్తున్న మహిళపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. మహిళ అన్న కనికరం లేకుండా చిత్రహింసలకు గురిచేశారని ఆరోపించారు. పోలీసులు చిత్రహింసలకు గురి చేయడంతో అవమానంగా భావించిన కుమారి తన కొడుకు ఎదుటె ఇంట్లో ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకుందని బంధువులు వాపోయారు. పిల్లలను బ్రతికించుకోలేక పెద్ద కుమారుడిని హాస్టల్లో వదిలి తన ఐదేళ్ల కొడుకుని మాత్రమే తన దగ్గర ఉంచుకుని జీవనం సాగిస్తోందని అన్నారు. తరచూ ఎక్సైజ్ పోలీసులు మద్యం పేరుతో 3,వేలు నాలుగు వేలు డబ్బులు తీసుకొని వెళ్తున్నారని మంగళవారం సీఐ చంద్రమణి గ్రామానికి వచ్చి కుమారిని చిత్రహింసలకు గురి చేసిందని ఆరోపించారు. దీంతోనే ఆమె ఉరివేసుకుందని వాపోయారు. కుమారి మృతి చెందడంతో తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు పిల్లలను ఎవరు పోషిస్తారని ప్రశ్నించారు. తన తల్లి మృతితో చిన్నారులు చేస్తున్న రోదనలు చూపరులను కంటతడిపెట్టించాయి.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - తలుపుల

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు సాంబశివ, రైతు సంఘం నాయకులు ముత్యాలు డిమాండ్ చేశారు. స్థానిక పంచాయతీ ఆఫీస్ నందు సిఐటియు ప్రజా సంఘాలు సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్బంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లు పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో జరిగే పోరాటాలలో తలుపుల మండలంలోని కార్మికులందరూ కలిసి రావాలని కోరారు. ఈ సందర్బంగా మండల కమిటీని ఏర్పాటు చేశారు. మండల కన్వీనర్ గా మహబూబ్ బాషా, కో కన్వీనర్లుగా సుశీల, హుస్సేన్ బి, మరో 10 మందిని తో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ సుజాత, ఆశా వర్కర్లు సావిత్రి, భారతి, దొడ్డప్ప, అశోక్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల జిల్లా కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-పెనుకొండ

శ్రీ సత్య సాయి జిల్లా ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెనుకొండ లోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ రాజశేఖర్ (ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల అనంతపురం) సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా డాక్టర్ కె.జయప్ప(ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెనుకొండ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా నాయక్ అనిల్ కుమార్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మడకశిర), కోశాధికారులుగా సి. సుమంగళి (ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల హిందూపురం), కృష్ణ నాయక్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కదిరి) ఎన్నికయ్యారు. పరవేక్షకుడిగా అనంతపురం ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ శ్రీధర్ కోనంకి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీలక్ష్మి, హరిప్రసాద్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, నాగమణి, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి : సిఐటియు

పరిగి : విఒఎల విషయంలో కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేవారు. పరిగి మండల వ్యాప్తంగా వెలుగు కార్యాలయంలో 9 మంది విఒఎలను తొలగించడం మండలంలో చర్చనీయంశంగా మారింది. తొలగించిన వివోఎలకు సిఐటియు నాయకులు మద్దతు పలికారు. హిందూపురం ఏసి క్లస్టర్ పరిధిలోని పరిగి మండల ఎపిఎం రమేష్ రెడ్డిని సిఐటియు ఆధ్వర్యంలో విఒఎలు కలసి తమ వ్యక్తిగత అర్జీలను సమర్పించారు. ఈసందర్బంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ వివోఎల విధులకు ఆటంకాలు, తొలగింపులకు గురి చేస్తున్న సీసీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విఒఎలకు న్యాయం చేయాలని లేకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాము, ఈశ్వర్, వీఎవో యూనియన్ జిల్లా కో కన్వీనర్ వెంకట్రాముడు, బైలప్ప, అశ్వర్థ రెడ్డి, తనూజ, గోవింద రెడ్డి, నాగరాజు శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆయుధాల నైపుణ్యత పరిశీలన

పుట్టపర్తి రూరల్ : జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ వి.రత్న తెలిపారు. బుక్కపట్నం మండలంలోని చంద్రాయనపల్లి సమీపంలోని గుట్ట ప్రాంతంలో ఉన్న ఫైరింగ్ రేంజ్ మైదానంలో జరుగుతున్న వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్‌లో ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఎస్పీ ఆయుధ నైపుణ్యాలను పరీక్షించారు. పోలీసులు తమ విధుల్లో వినియోగించే ఆయుధాలతో ఫైరింగ్ చేయించారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో, జిల్లా విభాగం ఆర్మడ్ రిజర్వుడ్ పోలీస్ అధికారుల సమక్షంలో ఐదు రోజులపాటు ఈ ఫైరింగ్ కార్యక్రమాలు నిర్వహించారు.చివరి రోజైన ఫైరింగ్ కార్యక్రమంలో డీఎస్పీలు, సిఐలు ,ఎస్ఐలు సిబ్బంది ఫైరింగ్ సాధన చేశారు.ఈ ఫైరింగ్ రేంజ్ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు , డిఎస్పి లు , విజయ్ కుమార్, కేవీ మహేష్ , వెంకటేశ్వర్లు, శివన్నారాయణ స్వామి ,శ్రీనివాసులు,ఎస్బిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఎఆర్ ఆర్ఐలు మహేష్, వలి, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్ కుమార్ , జిల్లాలోని సిఐలు , ఆర్ ఎస్ ఐ లు, ఎస్ఐలు , పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.



రైఫిల్ షూటింగ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ



నారా లోకేష్‌తో మాట్లాడుతున్న సామకోటి ఆదినారాయణ

నారా లోకేష్‌ను కలిసిన 'సామకోటి'

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్‌ను సత్య సాయి జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ కలిసి తన బయోడేటాను సమర్పించారు. బుధవారం అమరావతిలో మంత్రి లోకేష్‌ను ఆయన కార్యాలయంలో సామకోటి కలిశారు. ఈ సందర్బంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందుతున్నాయని, పార్టీ సభ్యత్వం సజావుగా సాగుతోందని వివరించినట్లు సామకోటి తెలిపారు. పార్టీ కోసం తాను కష్టపడి పని చేస్తున్నానని ఏదైనా అవకాశం కల్పించాలని కోరామన్నారు. కష్టపడే వారికి పార్టీ తగిన గుర్తింపు తప్పకుండా ఉంటుందని కార్యకర్తల సేవలను మరచిపోమని లోకేష్ భరోసా ఇచ్చారని సామకోటి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంఘం నాయకుడు బెల్లం తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తలుపుల

మహిళాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇందులో భాగంగా వెలుగు ఆఫీస్‌లో రిసోర్స్ సెంటరును ప్రారంభించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేసిందన్నారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ముబారక్, టిడిపి సీనియర్ నాయకులు ఓబుల్ రెడ్డి, మేడ శంకర, లగిడి జయచంద్ర, కొమ్మెర శీను, గంగరాజు, హై స్కూల్ హెడ్మాస్టర్ శంకరన్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టిడిపికి కంచుకోట : కదిరి నియోజకవర్గం టీడీపీ కి పెట్టిన కోట అని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ అన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో హిందూపురం పార్లమెంటులో అగ్రభాగాన నిలిచిన సందర్బంగా ఎమ్మెల్యే కందికుంట, టీడీపీ జిల్లా అధ్యక్షులు అంజనప్ప ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్‌లోని కదిరి నియోజకవర్గం అగ్రస్థానంలో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, నల్లచెరువు మండల కన్వీనర్ రాజశేఖర్, తనకల్లు మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి,ఎన్.పి.కుంట మండల నాయకులు అంజినప్ప నాయుడు,రెడప్ప తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట, తదితరులు

మడకశిరలో వరుస చోరీలు

ప్రజాశక్తి - మడకశిర

పట్టణంలోని ఐదు దుకాణాల్లో మంగళవారం రాత్రి చోరీ జరగింది. గుర్తుతెలియని దొంగల ముఠా ఒక కారులో వచ్చి ఒక కిరాణా కొట్టు, రెండు మెడకల్ షాపులు, ఒక బేకరీ, ఒక స్టీల్ సామాన్ల షాపులో చోరీలకు పాల్పడ్డారు. ఒకే రోజు ఐదు దుకాణాల్లో చోరీ జరగడంతో పట్టణ ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి చోరీల నివారణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇసుక టిప్పర్లు సీజ్

ప్రజాశక్తి - బత్తలపల్లి

చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తీసుకువెలుతున్న టిప్పర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. అనంతపురానికి చెందిన వ్యక్తులు రెండు టిప్పర్లులో ఇసుకను తీసుకు వెలుతున్నట్లు ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్‌కు సమాచారం అందిందన్నారు. ఆయన ఆదేశాల మేరకు గంటాపురం వద్ద రెండు ఇసుక టిప్పర్లును గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ముదిగుబ్బ రూరల్ సిఐ శ్యామ్ రావు తెలిపారు. పట్నం ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యం ను రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'పురం'లో చోరీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని చిన్న మార్కెట్ సర్కిల్ లో ప్రధాన రహదారి పక్కన నివాసముంటున్న పద్మావతమ్మ ఇంట్లో చోరీ జరిగింది. పద్మావతమ్మ తండ్రి మృతి చెందడంతో వైకుంఠ సమారాధన నిమిత్తం ఈ నెల 1న కర్నాటక రాష్ట్రం తుంకూర్ కి వెళ్ళింది. ఈ సమయంలో దుండగులు ఇంటి తలుపులను ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించి ఇంట్లోని బీరువాలో ఉన్న 200 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 50 వేల నగదు దోచుకెళ్లారు. తలుపులు తెరిచి ఉండటాన్ని బుధవారం ఉదయం చుట్టుపక్కల వారు గమనించి పద్మావతమ్మకు సమాచారం అందించారు. దీంతో ఆమె హుటాహుటిన ఇక్కడికి చేరుకొని పరిశీలించింది. తనకు జరిగిన అన్యాయంపై పోలీసులకు సమాచారం ఇచ్చిన సకాలంలో రాలేదని బాధితురాలు వాపోయింది.

పాత డీలర్‌పై ఫిర్యాదు

సోమందేపల్లి : మండల పరిధిలోని పత్తికుంట పల్లికి చెందిన పాతడీలర్‌పై నూతన డీలర్ ఫిర్యాదు చేశారు. పాత డీలర్ స్కేల్ ఇవ్వలేదని నూతన డీలర్ కృష్ణవేణి సిఎంఒకార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నూతన డీలర్ భర్త తిప్పన్న మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ కాలంలో నియమించిన డీలర్ తమకు స్కేలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని చెప్పారు. ఈ విషయాన్ని పలుమార్లు స్థానిక తహశీల్దార్, సచివాలయాల్లో ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం కన్పించలేదన్నారు. దీంతో సిఎంఒ కార్యాలయానికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మండల వనరుల కేంద్రానికి పోడియం వితరణ

ప్రజాశక్తి-పెనుకొండ

మండల వనరుల (ఎంఆర్‌సి) కేంద్రానికి యుటిఎఫ్ పెనుకొండ మండల శాఖ సౌజన్యంతో పోడియంను మండల విద్యాశాఖ అధికారులు సుధాకర్ చంద్రశేఖర్‌కు అందజేశారు. ఈసందర్బంగా శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి జి సి నరేష్ కుమార్ మాట్లాడుతూ మండల విద్యా శాఖ కార్యాలయానికి సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు అనుకూలంగా తాము వితరణ చేసిన సోడియం ఉపయోగపడుతుందన్నారు. యుటిఎఫ్ సీనియర్ ఉపాధ్యాయులు తయారుచేసిన పదవ తరగతి మోడల్ పేపర్లను త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. పోడియంను బహుకరించిన యుటిఎఫ్ నాయకులను మండల విద్యాశాఖ అధికారులు అభినందించారు.ఈ కార్యక్రమం లో పెనుకొండ మండల యూటీఎఫ్ అధ్యక్షులు జి.రమేష్ ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర, రవీంద్రనాథ్, నరసింహుడు, రామాంజినేయులు, జె. నరేష్, వెంకటా నాయక్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

ధర్మవరం రూరల్ : రోడ్డు నిబంధనలు పాటించాలని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నిర్వాహకులు కోరారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై బుధవారం పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్బంగా పాఠశాల కరెస్పాండెంట్ నిర్మల మాట్లాడుతూ రోడ్డు నిబంధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సూర్య ప్రకాష్ రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - తలుపుల

మండల పరిధిలోని ఈదులకుంట్ల పల్లి, కుర్లి గ్రామంలో బుదవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా పంటసాగు, యాజమన్యా పద్దతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ సనావుల్లా, వ్యవసాయ అధికారి షాదాబ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండలంలోని చేరువండ్లపల్లి, మారిశెట్టిపల్లి గ్రామాలలో పొలంబడి కార్యక్రమాన్ని బుదవారం నిర్వహించారు. ఈ సందర్బంగా పంటసాగు, యాజమన్యా పద్దతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు.

పంటల బీమా చేయించుకోండి

ప్రజాశక్తి - మడకశిర

రబీ సీజన్ 2024 - 25 సంవత్సరానికి పంటల వారీగా ప్రీమియం చెల్లింపు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రబీ సీజన్లో క్రాప్ లోన్ తీసుకున్న వాళ్లు నేరుగా బ్యాంకు ద్వారా ప్రీమియం చెల్లించవచ్చునని, బ్యాంకులో క్రాప్ లోన్ తీసుకొని వాళ్ళు మీసేవ కేంద్రంలో కానీ ,కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా కానీ, సచివాలయం కానీ దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి హేయం

ప్రజాశక్తి-హిందూపురం

తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో పనిచేస్తున్న ప్రొఫెసర్ చెంగయ్య పై దాడి చేసిన భజరంగదళ్ కార్యకర్తలను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ పై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ లో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు, జిల్లా కోశాధికారి హరికుమార్, బిఎస్పి సీనియర్ నాయకులు న్యాయవాది సత్యానందమూర్తి, నాయకులు సుబ్బరాయప్ప, కొండప్ప, నారాయణప్ప, మౌలాలి, రామాంజి, గోపాల్, వెంకటేష్, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

హిందూపురం : సద్గురు శ్రీ యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో బుధవారం 450 మందికి అన్నదానం చేశారు. గత 133 రోజులుగా పేదల ఆకలి తీర్చేందుకు దాతల సహకారంతో మధ్యాహ్నం వేళల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రవిశంకర్ తెలిపారు. బుధవారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి సేవాకర్తలుగా భగీరథ టెక్స్ టైల్స్ నిర్వాహకులు నవీన్ చంద్ర కుమార్, రెడ్డమ్మ వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లన్న, కైవారం తాతయ్య భక్తులు పాల్గొన్నారు.

ఘంటసాలకు నివాళి

ప్రజాశక్తి-హిందూపురం

పద్మశ్రీ ఘంటసాల జయంతి సందర్భంగా కళాకారులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని ఇందిరాపార్క్ లో ఉన్న ఘంటసాల విగ్రహానికి కళాకారులు, కవులు, రచయితలు నివాళులర్పించారు. ఈసందర్బంగా ఘంటసాల కళామందిర్ లో లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, లేపాక్షి ఉపాధ్యక్షులు అంజినరెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ గాయకులు ప్రసాద్ రావు, అదనపు జిల్లా న్యాయస్థానం అడ్మినిస్ట్రేటివ్ అధికారి నరసింహులును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, కళా మందిర్ కార్యదర్శి లోకేష్, ఆంజనేయులు, మనోహర్, అంజినేయులు, దయానంద్, రామ్మూర్తి, నారాయణ, ప్రసాద్, శ్రీనివాసులు, అనిత, గాజుల శ్రీనివాసులు, నాగరాజు, చంద్రారెడ్డి, చాలకూరు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.